సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం భోగారం గ్రామానికి చెందిన గద్ద కళ్యాణికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును ఆయన లబ్ధిదారురాలికి అందజేశారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ చెప్యాల వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నత్తి భూపాల్, గడ్డం కృష్ణ, గడ్డం రఘు తదితరులు పాల్గొన్నారు. కీసర గ్రామంలోని శివాజీనగర్‌కు చెందిన ఎల్. సంతోష్‌కు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ 21 వేల చెక్కును ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బాల్‌రాజ్, మిట్టపల్లి రాఘవేందర్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఫలహారం బండి ఊరేగింపు


ఫలహారం బండి ఉరేగింపులో ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

కీసర: ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం రాత్రి అమ్మవారికి ఫలహారం బండి ఉరేగింపు కార్యక్రమానివైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్, కౌన్సిలర్లు రమేష్‌గౌడ్, శ్రీహరిగౌడ్, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కార్యవర్గం



ఘట్‌కేసర్: సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని గురుకుల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నూతన కమిటీ ఎన్నిక కోసం సమావేశం నిర్వించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు నర్సింహారావు, ఉపాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా రంగయ్య, ఉపాధ్యక్షుడిగా యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సోమయ్య, ఎన్నారెడ్డి, కోశాధికారిగా పోచిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కృష్ణ, నాగరాజు, ముత్యాలును ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రంగయ్య మాట్లాడుతూ... సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారం కృషి చేస్తానన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

మేడ్చల్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు.. వారు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి ఇతరత్రా అంశాలపై తగు సూచనల కోసం మేడ్చల్ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. ప్రయాణికులు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఫోన్: 99592 26152కు తగు సూచనలు చేయాలని కోరారు.

అనుమానించారని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

- అలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో అదృశ్యమైన బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... నిజామాబాద్ ఆర్మూర్‌కు చెందిన పీసు వెంకట్‌రెడ్డి(19) స్థానికంగా ఉంటూ కీసర బోగారం హోలీ మేరీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో హాస్టల్‌లో ఫోన్‌లు చోరీకి గురయ్యాయని వాటిని వెంకట్‌రెడ్డి తీశాడని అందరూ అనుమానించారు. ఈ నెల 25న రాత్రి ఒంటి గంటకు బయటకు వచ్చి రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్లి బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ మధ్య ఓ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కనిపించక పోవడంతో అతడి మేనమామ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా 26న అదృశ్యం కేసు నమోదైంది. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు 25న ఉదయం స్థలానికి చేరుకొని శవాన్ని గాంధీ ఆస్పత్రిలో భద్రపరిచారు. సోమవారం మృతుడి కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి వెళ్లడంతో ఆత్మహత్య విషయం బయటపడింది. పోలీసుల విచారణలో అతడికి దురలవాట్లు ఉన్నట్లు తేలింది. శవాన్ని కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుతున్న ఉప్పల్ భగాయత్ సమస్యలు !

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఉప్పల్ భగాయత్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు అన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అధికారులు ఇచ్చిన మాట ప్రకారం హెచ్ఎండీఏ లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. త్వరలోనే సీఎంను కలిసి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈగ సంతోష్ ముదిరాజ్, సుధాకర్, సోమ్ జంగయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

ఉప్పల్: ప్రజలు తమ కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ డివిజన్ పరిధిలో వెంకటేశ్వర కాలనీలో కాలనీ అసోసియేషన్ల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శివారు ప్రాంతాల్లో కాలనీలు పెరుగుతున్నాయన్నారు. అదే క్రమంలో నేరాలు కూడా పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీల్లో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను అదుపు చేసే అవకాశం ఉంటుందన్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్‌లో 50 సీట్లతో... కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ

ప్రైవేట్ భవనంలో తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు

- ఎన్ఎంసీ అనుమతిస్తే 24-25వ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్స్
- కుత్బుల్లాపూర్‌లో కాలేజీ నిర్మాణానికి 20 ఎకరాల స్థలం కేటాయింపు
- ప్రిన్సిపాల్‌తో సహా పూర్తయిన అధ్యాపకుల నియామకాలు



ఈసీఐఎల్‌లో తాత్కాలిక భవనంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ

సాక్షి, సిటీబ్యూరో: ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో తాత్కాలికంగా కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం అన్నీ చర్యలు తీసుకుంటోంది. ఎన్ఎంసీ అనుమతిస్తే... మెడికల్ కాలేజీలో 2014-15వ విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తోంది. పరిశ్రమలకు కేంద్ర బిందువుగా విరాజిల్లుతున్న శివారు మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తుండటంపై ఆనందాన్ని వ్యక్తంచేస్తున్న ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందగలవని అధికార యంత్రాంగం పేర్కొంటోంది. కొత్త వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డాక్టర్ మురళీ కృష్ణను నియమించటంతోపాటు తరగతుల నిర్వహణకు అనువైన భవనాన్ని గుర్తించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయటంతో తాత్కాలికంగా ఈసీఐఎల్‌లోని ఒక ప్రైవేట్ భవనాన్ని ఎంపిక చేసిన జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. అలాగే అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలను తీసుకొంటోంది. కాలేజీకి ప్రిన్సిపాల్‌తోసహా పలు విభాగాలకు సంబంధించిన అధ్యాపకుల నియామకాల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఫర్నిచర్, ల్యాబ్‌లతోసహా మెడికల్ కాలేజీకి కావలసిన పరికరాలను అధికార యంత్రాంగం సమకూర్చుతోంది. ఇప్పటికే ప్రైవేట్ భవనంలో నిర్వహించనున్న మెడికల్ కాలేజీని సందర్శించిన జాతీయ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ), మరోదఫా కూడా పర్యవేక్షించి... ప్రారంభానికి సంబంధించిన అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్ఎంసీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే.. మొదటి ఏడాదిలో 50 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేస్తారు. క్రమంగా సీట్ల సంఖ్యను పెంచనున్నారు.ప్రభుత్వ మెడికల్ కాలేజీ రాక, అడ్మిషన్ల ప్రక్రియ మొదలుతో మల్కాజిగిరి జిల్లాలో ప్రజలకు మరిన్నీ వైద్య వసతులు పెరగనున్నట్లు జిల్లా వైద్య.ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

అనుబంధంగా మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రి

ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మల్కాజిగిరిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఎంపిక చేసిన జిల్లా అధికార యంత్రాంగం పడకల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకుంటోంది. మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రిలో ప్రస్తుతం 70 పడకలు ఉండగా, ఆ సంఖ్యను 220 పడకలకు పెంచినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి పేర్కొన్నారు. అలాగే పడకల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన సదుపాయాలు, పరికరాలు, డాక్టర్లు, సిబ్బంది సంఖ్యనూ పెంచారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్వహణ కోసం రిక్రూట్ చేసిన ప్రిన్సిపాల్‌తోసహా అధ్యాపకులు ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కేంద్రంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

కాలేజీకి 20 ఎకరాల స్థలం

సామాన్యులకు కూడా వైద్య విద్యను అందించాలనే లక్ష్యంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ చొప్పున మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఈ కొత్త మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే మెడికల్ కాలేజీ నిర్మాణానికి స్థానికంగా 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది. అయితే.. మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా ఈసీఐఎల్‌లోని ప్రైవేట్ భవనంలో మెడికల్ కాలేజీ తరగతులను ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లన్నీ కూడా పూర్తి చేసింది.

వైభవంగా బీరప్ప బోనాలు


బోనాలు తీసుకొస్తున్న మహిళలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బీరప్ప బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరిగాయి. డప్పు చప్పుళ్లతో, డోలు వాయిద్యాలతో హాజరై మహిళలు బోనాలు సమర్పించారు.

పోలీసుల 'సైకిల్ పెట్రోలింగ్'


సైకిల్ పెట్రోలింగ్ చేస్తున్న కీసర పోలీసులు

కీసర: నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా కీసర ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటయ్య ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. అందులోభాగంగా కీసరలోని మండే మార్కెట్‌లో సైకిల్ పెట్రోలింగ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక శక్తులను కట్టడి చేసేందుకు ఆకస్మిక తనిఖీలు, సోదాలు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజలకు అవగాహన కల్పించారు.

రాణే ఇంజన్‌వాల్స్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం


కార్యవర్గ జాబితాను అందజేస్తున్న యూనియన్ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ పారిశ్రామిక వాడలోని రానే ఇంజన్‌వాల్స్‌లో ఇటీవల జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికలలో బీఆర్‌టీయూ విజయం సాధించగా సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యవర్గ సభ్యుల పరిచయ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడిగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారాయణ, సలహాదారుడిగా ప్రభాకర్, ఉప కార్యదర్శులుగా రమేష్, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా చారి, యాదగిరి తదితరులను నియమించి నూతన కార్యవర్గంను కంపెనీ యాజమాన్యంకు పరిచయం చేశారు.

మద్యం మత్తులో కత్తులతో పరస్పరం దాడి

శామీర్‌పేట్: పాత కక్షల నేపథ్యంలో యువకులు కత్తులతో పరస్పరం దాడులు చేసుకున్నారు. శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ సమాచారం మేరకు... అద్రాస్‌పల్లికి చెందిన జీడి మహేష్ తనకున్న స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. నిర్మాణంలో ఉన్న ఆ ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవిస్తున్నారని అసభ్య పదజాలంతో దూషించాడు. ఈక్రమంలో ఇంటి పక్కనే నివాసం ఉండే జీడి మల్లేష్ తననే తిడుతున్నాడని ఘర్షణకు దిగాడు. దీంతో జీడి మహేష్ వెంటనే మద్దతుగా బావమరుదులు జూపల్లి మహేష్, నాగరాజులను పిలిపించాడు. దీంతో జీడి నర్సింహా, జీడి బాబులను జీడి మల్లేష్ పలిపించుకున్నాడు. ఇరువురి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇరు వర్గాలు తెచ్చుకున్న కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో జీడి నర్సింహా చేతికి, జీడి మహేష్‌కు ఛాతి, జూపల్లి మహేష్‌కు ముఖంపై గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమాచార హక్కు కార్యకర్తపై కేసు ఉపసంహరణ

పోచారం: సమాచార హక్కు కార్యకర్త ఓదెల సురేష్ బాబుపై అన్నోజిగూడలోని ఎల్ఎన్ కాలనీకి చెందిన పి.రేణుక కేసు ఉపసంహరించుకొంటున్నట్లు అధికారులు సమాచారమిచ్చారు. పోలీస్ స్టేషన్‌లో తాను ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటున్నట్లు ఆమె లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ... కాలనీలో జరుగుతున్న అన్యాయాలపై అధికారులకు తాను ఫిర్యాదు చేస్తున్నందుకే తనపై కొందరు వ్యక్తులు కావాలని తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

కాగితం మీదే లే అవుట్!

- ఓ వెంచర్‌ను చూపి మరో ప్లాట్ల విక్రయం

మేడ్చల్: డబ్బు సంపాదించడానికి ఎవరినైనా ఎక్కడైనా మోసం చేయడానికి ఓ వ్యాపారి వేసిన ఎత్తుగడ ఇది. మండలంలోని అత్వెల్లి, డబీల్‌పూర్, ఎల్లంపేట్ శివారులలో భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారి హెచ్ఎండీఏ, ఇతర అన్ని రకాల అనుమతులు తీసుకొని బడా వెంచర్ చేశాడు. డబీల్‌పూర్ పరిధిలో ఆ వెంచర్‌కు ఆనుకుని డబీల్‌పూర్‌కు సంబంధించిన 5582 గజాల స్థలం ఉంది. ఈ స్థలం నుంచి గ్రామానికి రోడ్డు ఉంది. ఈ నేపథ్యంలో సదరు వ్యాపారి తెలివిగా ఆలోచించి ప్లాట్లు కొనుగోలు చేసేవారిని బురిడీ కొట్టించేందుకు యత్నించాడు. ఖాళీ స్థలానికి పేపర్‌పై లేవుట్ చేసి అందులో 29 ప్లాట్లను ఏర్పాటు చేశాడు. హెచ్ఎండీఏ వెంచర్‌లో ఖాళీ స్థలం ఉండటంతో చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్మాలనే కుట్రలకు తెరలేపాడు. ఖాళీ స్థలంలో ప్లాట్లు చేయకుండానే పేపర్‌పై 29 ప్లాట్లు చేసి హెచ్ఎండీఏ వెంచర్లోని ప్లాట్లుగా చూపి విక్రయం చేసే యత్నాలు చేశారు. గతంలో ఈ విషయంపై డబీల్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జాయింట్ రిజిస్ట్రార్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలిచినా అక్రమాలు ఎక్కడ ఎలా జరుగుతున్నాయో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

అనారోగ్యంతో పంచాయతీ కార్యాలయ ఆపరేటర్ మృతి


ఉదయ్ (ఫైల్)


మేడ్చల్‌రూరల్: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉదయ్(28) రాజబొల్లారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గత రెండేళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం అనారోగ్యానికి గురైన ఉదయ్‌కు కుటుంబీకులు ఆస్పత్రిలో చికిత్స నిర్వహించగా వైద్యులు రెండు కిడ్నీలు పాడైనట్లు వెల్లడించారు. నాటి నుంచి కిడ్నీ వాధి సమస్యతో బాధపడుతూ వారంలో మూడు సార్లు డయాలసిస్ చికిత్స పొందుతూ కొంతమేర కోలుకున్న ఉదయ్ సోమవారం తెల్లవారుజామున మరోమారు అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గ్రామ నాయకులు, గ్రామస్తులు, విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

పశువులపై వీధి కుక్కల దాడి


కుక్కల దాడిలో గాయపడిన లేగ దూడ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. గత వారం ఓ బాలుడిపై దాడి చేసి గాయాలపాలు చేసి కుక్కలు తాజాగా పశువులపై దాడికి పాల్పడ్డాయి. మున్సిపాలిటీకి చెందిన నరేందర్‌రెడ్డి అనే రైతు ఆవు, లేగ దూడలపై సోమవారం కుక్కలు దాడికి పాల్పడి చెవు, గొంతు భాగంలో కొరికాయి. తీవ్ర రక్తస్రావంలో పశువులు గాయాలపాలయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కుకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యం


వెంకటేశ్వరరావు

పోచారం: ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన దేవులపల్లి వెంకటేశ్వర రావు(72) పార్కుకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఆదివారం ఉదయం వెళ్లిన తను తిరిగి ఇంటికి రాలేదు. దీంతో సమీపంలోని పార్కులు, బంధుమిత్రుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆయన కొడుకు అనంతమూర్తి పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో వ్యక్తి...

ఘట్‌కేసర్: పనికి వెళుతున్నానని ఇంటిలో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... శివారెడ్డి గూడకు చెందిన యనమాదిల చెన్నయ్య(43)కు 19 సంవత్సరాల క్రితం నిర్మలతో వివాహమైంది. రెండు నెలలుగా చెన్నయ్య పని చేయకుండా ఇంటి దగ్గరే ఉంటున్నాడు. చిన్నచిన్న విషయాల్లో భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. ఈ నెల 27న మధ్యాహ్నం చెన్నయ్య పనికి వెళుతున్నాయని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా అచూకీ లభించక పోవడంతో భార్య నిర్మల ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


చెన్నయ్య

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు సన్నద్ధం

- ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం కసరత్తు
- ఫీల్డ్ వెరిఫికేషన్‌కు ప్రత్యేక బృందాల ఏర్పాటుకు చర్యలు
- గ్రేటర్ శివారుల్లో 29 పురపాలక సంఘాలసహా 297 జీపీల్లో 3.85 లక్షల దరఖాస్తులు
- అత్యధిక దరఖాస్తులకు అక్రమ వెంచర్లే కారణం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ శివారుల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు అధికార యంత్రాంగం సిద్ధమతోంది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత పటిష్ఠంగా లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)ను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా శివారులోని మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద వచ్చిన దరఖాస్తులకు మోక్షం కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం మార్గదర్శకాలపై కసరత్తు చేస్తోంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసేందుకు ఫీల్డ్ వెరిఫికేషన్‌కు ప్రత్యేక టీమ్‌ల ఏర్పాట్లపై దృష్టి పెట్టిన యంత్రాంగం మార్గదర్శకాలు అందగానే హెచ్ఎండీఏతో కలిసి సంయుక్తంగా రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతోంది.

- మొదటి దశలో గ్రామపంచాయతీ లేదా పురపాలక సంఘం నుంచి వచ్చిన దరఖాస్తులను సర్వే నంబర్ల వారిగా క్లస్టర్లు విభజించి, స్థల పరిశీలనకు సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందికి సూచన చేయనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.
- రెండో దశలో భాగంగా వివిధ శాఖలతో పాటు స్థానిక టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలకు చెందిన వారితో ఏర్పాటైన బృందాలు (టీమ్‌లు) ప్రతి క్లస్టర్‌ను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాల్సి ఉంది.
- తనిఖీల సందర్భంగా పరిశీలించిన అంశాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా సంబంధిత బృందాల(టీమ్‌ల)ను సన్నద్ధం చేయాలని పురపాలక సంఘాలు, గ్రామ పంచాతీయ (జీపీ) లకు అధికార యంత్రాంగం సూచించినున్నట్లు తెలుస్తోంది.
- ఎల్ఆర్ఎస్ నిబంధనల ప్రకారం దరఖాస్తు ఉందా... లేదా అనే విషయాన్ని పరిశీలించిన బృందాల్లో సభ్యులు సంబంధిత కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు నివేదిక అందజేయనున్నారు.
- రెండు దశల ప్రక్రియ పూర్తి చేసి ఎల్ఆర్ఎల్ దరఖాస్తుల పురోగతిపై ఆయా కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదించాల్సి ఉండటంతో దానికి తగినట్టుగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

అర్హత దరఖాస్తులకు కొత్త మార్గదర్శకాలు...

క్రమబద్ధీకరణనకు అర్హత ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి పురపాలక శాఖ మళ్లీ కొత్త మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

- అర్హత ఉన్న దరఖాస్తులకు అవసరమైన అదనపు సమాచారాన్ని, సంబంధిత శాఖల నుంచి కావాల్సిన ఎన్‌ఓసీలు సమర్పించేందుకు నెల రోజులు గడువు ఇచ్చే అవకాశం ఉంటోంది.
- అర్హత కలిగిన దరఖాస్తుల విషయంలో చెల్లించాల్సిన క్రమబద్ధీకరణ ఫీజును దరఖాస్తుదారుడు ఆన్‌లైన్ ద్వారా నోటిఫై చేయడంతో పాటు చెల్లింపునకు తగినంత సమయం కూడా ప్రభుత్వం ఇవ్వన్నట్లు సమాచారం.
- సైట్ తనఖీ తర్వాత ఎల్ఆర్ఎస్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని.. అర్హత లేని దరఖాస్తులను తిరస్కరిస్తారు.
- శివారుల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 3.85 లక్షలు గ్రేటర్ హైదరాబాద్ శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 3,85,674 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి.
- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 25 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా, భూముల ధరలకు రెక్కలచ్చి, రియల్ ఎస్టేట్ భూమ్ బాగా ఉన్న గ్రేటర్ శివారు జిల్లాలైన మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఏడు కార్పొరేషన్లు, 22 మున్సిపాలిటీలతోపాటు 297 గ్రామపంచాయతీ పరిధిలో 3,85,674 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి.
- ఇందులో రెండు జిల్లాల పరిధిలోని 297 గ్రామ పంచాయతీల్లో వచ్చిన దరఖాస్తులు 11,227 ఉన్నాయి.
- రంగారెడ్డి జిల్లాలోని తుర్కయంజాల్ పురపాలక సంఘంలో అత్యధికంగా 47,362 దరఖాస్తులు కాగా, రెండవ స్థానంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో 46,894 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు నమోదయ్యాయి.
- అతి తక్కువగా జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 368 దరఖాస్తులు వచ్చాయి.
- శివారు జిల్లాల్లో అత్యధికంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రావటానికి అనాధికార, అక్రమ వెంచర్లు, అక్రమ లేఅవుట్లు కారణంగా తెలుస్తున్నది.
- రంగారెడ్డి జిల్లాలోని 3 మున్సిపల్ కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీలతో పాటు 246 గ్రామ పంచాయతీ పరిధిలో 2,41,747 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 4 కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాలిటీల సహా 61 గ్రామ పంచాయతీల పరిధిలో 1,43, 927 దరఖాస్తులు నమోదు అయ్యాయి.

జిల్లా	పురపాలక సంఘాలు	జీపీలు	మొత్తం దరఖాస్తులు
రంగారెడ్డి	2,35,417	6,330	2,41,747
మేడ్చల్	1,39,030	4,897	1,43,927
మొత్తం	3,74,447	11,227	3,85,674

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387